## క్లుప్తంగా

### పోచమ్మ గుడి పునర్నిర్మాణానికి భూమిపూజ



బోధన్: ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు పోచమ్మ గుడి, నాగదేవత పుట్టను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. బుధవారం పోచారం గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పోచమ్మ గుడి పున: నిర్మాణం కోసం కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోచారం, జానకంపేట గ్రామాలకు చెందిన నాయకులు భూమి పూజ చేశారు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమా కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో పలువురు బాధితులకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు ఎదురు చూడకుండానే నిర్మాణ సమయంలోనే ప్రభుత్వం దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు గ్రామ శాఖ అధ్యక్షులు సుమన్‌నాయక్ తెలిపారు. ముత్తెన్న, రమేశ్, శివశంకర్, శ్రీధర్, కిశోర్ ఉన్నారు.

### టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవం



బోధన్: పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో గల ఎస్సీ బాలుర హాస్టల్‌లో తెలంగాణ విద్యార్థి పరిషత్ 13 వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మీసాలే నగేశ్ పరిషత్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. తమ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేదని తెలిపారు. డివిజన్ కార్యదర్శి నిఖిల్,పట్టణ కార్యదర్శి వీరేశ్,ప్రతినిధులు సావిన్, దినేష్, దత్తా, సిద్దార్థ్,వరప్రసాద్, అజయ్, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### హైకోర్టు తీర్పు మేరకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



బోధన్: ఇటీవల హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు మేరకు 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిలకు కలిసి వినతి పత్రం అందించామని బోధన్‌కు చెందిన పాత పెన్షన్ దారుల పోరాట సమితి ప్రతినిధి ఎంబెల్లి శంకర్ తెలిపారు.హైకోర్టు తీర్పు సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ఆ సమితి రాష్ట్ర ప్రతినిధులు వినోద్, సంతోష్, విజయ్,మాణిక్యం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్, కాయిల్స్ చోరీ



బాల్కొండ: బాల్కొండ శివారులో గంజిగిరి రాజన్న, బానాజీ రాజేశ్వర్‌కు చెందిన పంట పొలాల్లోని 25 కేవీ, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గుర్తుతెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి ఆయిల్, కాయిల్స్ ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పొలాల్లోకి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడేసి ఉన్నాయి. బాధితులు వెంటనే ట్రాన్స్‌కో ఏఈ కిషన్‌కు సమాచారమివ్వడంతో ఆయన సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నవీపేట: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షులు ద్యాగ సరిన్ సూచించారు. మండలంలోని యంచ, నందిగామ్, కోస్లీ, నాగేపూర్ గ్రామాలలోని పార్టీ కార్యకర్తలతో ఆయన బుధవారం సమావేశాలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను గ్రామాలలో వివరించాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, రాజేందర్‌గౌడ్, పిల్లి శ్రీకాంత్, రాజశేఖర్, సాయినాథ్, యోగేష్, సందీప్, జీవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా రోడ్లు



నందిపేట రాజానగర్ హనుమాన్ మందిరం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- గుంతల్లో నిలుస్తోన్న వర్షపు నీళ్లు
- నందిపేటలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నందిపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. మండల కేంద్రంలోని ఐలమ్మ చౌరాస్తా నుంచి మండల కార్యాలయాలకు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారులు దారుణంగా మారాయి. తారు రోడ్డు ధ్వంసమై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈగుంతల్లో నీళ్లు నిలవడంతో నందిపేట మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఈరోడ్డు గుండా వెళ్లాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు. మండల కార్యాలయాలకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన సీసీ డ్రెయినేజీ ఆనవాళ్లు కోల్పోయింది. డ్రెయినేజీ మట్టితో పూడిక నిండింది. డ్రెయినేజీ మధ్యలో చెట్లు పెరిగాయి. దీంతో వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

### బాల్కొండలోని ఎన్టీఆర్ కాలనీలో..



గుంతలమయంగా ఎన్టీఆర్ కాలనీ రోడ్డు

బాల్కొండ : బాల్కొండలోని ఎన్టీఆర్‌కాలనీ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీఆర్ కాలనీ జాతీయ రహదారి 44 బైపాస్‌ను ఆనుకుని ప్రారంభమవుతుంది. జాతీయ రహదారి దిగగానే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. సాధారణ ఎన్నికలకు ముందు నామమాత్రంగా ప్రధాన రోడ్డుపై తారు వేసి వదిలేశారు. ప్రస్తుతం చిన్న పాటి వర్షాలకే గుంతల మయంగా మారుతుంది. ఈరోడ్డు గుండా మోడల్ పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళా డిగ్రీకాలేజీలో విద్యార్థి ఎన్నికలు



విద్యార్థినులకు ఎన్నికలు నిర్వహిస్తున్న అధ్యాపక బృందం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు ఎన్నికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. విద్యార్థుల్లో సమర్థతను, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా ప్రతి సంవత్సరం ఈఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. ఈసందర్భంగా ప్రతినిధులుగా తమ తోటి విద్యార్థినులను ఎన్నుకొని విద్యార్థి సంఘ మండలిని ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజాస్వామ్య విధివిధానాలు, నిబంధనలతో ఎన్నికలు నిర్వహించామన్నారు. కళాశాల కెప్టెన్, వైస్ కెప్టెన్, సెక్రెటరీ, మొదలగు 12 విభాగాల్లో నామినేషన్లు జరిగాయని పేర్కొన్నారు. అనంతరం గెలిచిన విద్యార్థి ప్రతినిధులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సుంకిని హైస్కూల్‌లో సామగ్రి ధ్వంసం



రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని హైస్కూల్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గ్రంథాలయ గదిలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు గదిలో చెల్లాచెదురుగా పడి ఉన్న పుస్తకాలు, ధ్వంసమైన సామగ్రి కనిపించాయి. వెంటనే వారు ఎంఈవోకు, గ్రామ పెద్దలకు సమాచారమందించారు. పాత కంప్యూటర్‌లు, రేడియో, కీపాడ్స్ ధ్వంసమైనట్లు గుర్తించారు. ఈ మేరకు కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్టు ఉపాధ్యాయులు తెలిపారు.

## మొక్కలను కాపాడేదెవరు

- బడ్జెట్ లేదని కంచెల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- పశువులకు మేత అవుతున్న మొక్కలు



ముప్కాల్ మండల కేంద్ర శివారులో ఎస్సారెస్పీ ఆనకట్టపై కంచె ఏర్పాటు చేయని మొక్కలు



పశువులు మేసిన మొక్క

బాల్కొండ: వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో నాటుతున్న మొక్కలకు కంచెలను ఏర్పాటు చేయడంలో ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముప్కాల్ మండల కేంద్ర శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై రెండు వైపులా మొక్కలను నాటారు. వాటికి కంచెలు ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో మొక్కలను పశువులు తింటున్నాయి. కేవలం లక్ష్యం కోసం మాత్రమే మొక్కలు నాటుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది అదే ఆనకట్టపై మొక్కలు నాటారు. కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఒక్క మొక్క కూడా లేకుండా పోయింది. మళ్లీ ఈ ఏడాది అక్కడే మొక్కలు నాటారు. మళ్లీ మొక్కలను పశువులు తిన్నాయి. కంచెలు ఏర్పాటు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలో లేదని విమర్శలు ఉన్నాయి. కంచెలు ఏర్పాటుకు కావాల్సిన బడ్జెట్ లేదంటూ సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాటిన మొక్కలను కంచెలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

బడ్జెట్ లేకపోవడంతో నాటిన మొక్కలకు కంచెలు ఏర్పాటు చేయడం లేదు. మొక్కలను కాపాడుటకు చర్యలను తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– గౌస్‌మొయినొద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీవో, ముప్కాల్

## రైతులు మరమ్మతులు చేపటొద్దు



రైతు పొలం బాటలో ట్రాన్స్‌కో అధికారులు

బాల్కొండ: రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి మత్మతులు చేపట్టొద్దని ట్రాన్స్‌కో ఏఈ కిషన్ అన్నారు. బుధవారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో ట్రాన్స్‌కో అధికారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు కరెంట్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే స్థానిక లైన్‌మన్‌కు సమాచారమివ్వాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఎల్ఐ సుందర్‌రావు, ఎల్ఐ రవీందర్, లైన్‌మన్‌లు మల్లెష్, కంచెట్టి, సంతోస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముందుకు సాగని సమీకృత మార్కెట్ పనులు



శక్కర్‌నగర్ కాలనీలో నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

బోధన్ టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో చేపట్టిన సమీకృత వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులు రెండేళ్లు అవుతున్న ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో సమీకృత వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ మార్కెట్ నిర్మాణ పనుల నిమిత్తం జీవో నెం: 51 స్పెషల్ ఫండ్‌లో భాగంగా రూ. 10 కోట్లు కేటాయించారు. కాంట్రాక్టర్ పిల్లర్ల వరకు పనులు చేపట్టి నిర్మాణ పనులను నిలిపి వేశారు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమీకృత వెజిటబుల్ మార్కెట్ పనులను ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం అడుగులు



ఫైర్ స్టేషన్‌నిర్మాణం కోసం చదును చేసిన స్థలం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం అడుగులు పడుతున్నాయి. పాత ఐకేపీ భవనంలో ఫైర్ స్టేషన్‌ను నిర్వహిస్తున్నారు. ఫైర్ స్టేషన్ వద్ద కనీసం ఫైర్ ఇంజిన్‌ను నిలుపుటకు షెడ్డూ కూడ లేదు. గదుల కొరత తీవ్రంగా ఉంది. 2023లో ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. స్థల కేటాయింపు సకాలంలో కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. జాతీయ రహదారి 44 సమీపంలో టీటీడీ కల్యాణ మండపం పక్కన స్థలం కేటాయించారు. బండరాళ్లతో కూడిన కొండ ప్రాంతం కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టుటకు ముందుకు రాలేదు. ప్రస్తుతం ఎట్టకేలకు భవనం నిర్మాణం కోసం పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పనులు ప్రారంభమవుతున్నాయి. బండరాళ్లను తొలగించి, నిర్మాణం కోసం చదును చేశారు. త్వరలోనే ఫైర్ స్టేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి శేఖర్ తెలిపారు.

## సంక్షిప్తం

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎడపల్లి ఎస్సై ముత్యాల రమా అన్నారు. బుధవారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల ఫోన్‌కాల్స్, వాట్సాఫ్ మెస్సేజ్‌లకు స్పందించకూడదన్నారు. పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

**డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒక రోజు జైలు శిక్ష**

రుద్రూర్: డ్రంకన్ డ్రైవ్ కేసులో మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన పొశెట్టికి ఒక రోజు జైలు శిక్షను బుధవారం బోధన్ కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి విధించినట్టు ఎస్సై సాయన్న తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల వాహనాల తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి పొశెట్టి పట్టుబడటంతో బుధవారం కోర్టులో హాజరు పర్చారు.

**బస్సు డ్రైవర్‌కు ..**

రుద్రూర్: రుద్రూర్ బస్టాండ్ సమీపంలో అతి వేగంగా, అజాగ్రతగా బస్సును నడిపి కారును ఢీకొట్టిన కేసులో ఆర్టీసీ డ్రైవర్‌కు బోధన్ మేజిస్ట్రేట్ రూ.వెయ్యి జరిమానా, ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరుగగా డ్రైవర్ సురేశ్‌ను బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

**పేకాడిన తొమ్మిది మందికి ..**

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పేకాడుతూ పట్టుబడ్డ వారికి బోధన్ న్యాయమూర్తి శేషతల్ప సాయి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారని ఎస్సై సునీల్ తెలిపారు. పోతంగల్ మండలం కల్లూర్ శివారులో ఈ నెల 8న పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో ఇద్దరికి రెండు రోజులు, రూ.4వేల జరిమానా, ఏడుగురికి ఒక రోజు జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

**ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీస్‌లు**

బాల్కొండ: వర్ని మండలం అంతపూర్ తండాకు చెందిన ఒక వ్యక్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వస్తున్నట్లు మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని బుధవారం మధ్యాహ్నం సమాచారమందుకున్నారు. దీంతో సిబ్బందితో పోచంపాడ్ జాతీయ రహదారి 44 కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడ తనిఖీలు నిర్వహించి ఆత్మహత్యాయత్నంకు వచ్చిన వ్యక్తిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై వెంటనే స్పందించడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన**

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్, సుర్బిర్యాల్, కోమన్‌పల్లి, ఖానాపూర్ గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో శివాజీ పరిశీలించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని గ్రామాల్లో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను నిత్యం పర్యవేక్షిస్తుండాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తులం బంగారం పథకాన్ని వెంటనే ప్రారంభించాలి



దరఖాస్తులపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్‌చేశారు. బుధవారం ఆయన వేల్పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 244 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారుల దరఖాస్తులపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు ఎన్ని ఉన్నా తాను నియోజకవర్గం వచ్చినప్పుడల్లా సంతకాలు చేయించుకోవాలని అధికారులకు సూచించారు.

## రోడ్లపై కూరగాయలు విక్రయించొద్దు



పెర్కిట్‌లో వ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రఘుపతి

ఆర్మూర్‌టౌన్: కూరగాయలు రోడ్లపై విక్రయిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రోడ్లపై కూరగాయలు విక్రయించొద్దని ట్రాఫిక్ ఎస్సై రఘుపతి అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ వెళ్లే దారిలో కూరగాయలు రోడ్డుపైన విక్రయించడంతో ట్రాఫిక్ పోలీసులు విక్రయదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురగాయలు రోడ్లపై విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

## పర్యావరణంపై బాధ్యత కలిగి ఉండాలి



విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న తిరునగరి సింహయ్య



బోధన్‌లోని బీటీనగర్ జీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు బాల్యం నుంచే పర్యావరణంపై బాధ్యత కలిగి ఉండాలని పట్టణానికి చెందిన మాధవి విద్యాలయం కరస్పాండెంట్ తిరునగరి సింహయ్య పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని మాధవి విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు వన మహోత్సవంలో భాగంగా పలు రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరునగరి సింహయ్య మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరునగరి శ్రీనివాస్, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి**

బోధన్: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పాఠశాల హెచ్ఎం స్వరూప రాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు రాజు,వినయ్,నవనీత,వాహెద్,అప్సరీబేగం,వాణి, విజయ తదితరులు పాల్గొన్నారు. వనమహోత్సవంలో భాగంగా స్థానిక వివేకానంద, ఆచన్‌పల్లి ప్రాంతంలోని ఇందూర్ బీఈడీ కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

**మత్స్య శాఖ ఆధ్వర్యంలో ..**

వర్ని(చందూర్): వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా చందూరు మండలం గన్‌పూర్ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. గ్రామ శివారులోని చెరువుగట్టుపై చింత, మామిడి వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ నరేందర్, గన్‌పూర్ గ్రామ బోయి సంఘం అధ్యక్షులు లాలబోయి, ఉపాధ్యక్షులు లింగబోయి పాల్గొన్నారు.



గన్‌పూర్‌లో.. మత్స్యశాఖ అధికారులు

## అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవీపేట ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీతో పాటు మండల కేంద్రంలోని టీఎస్ ఆదర్శ పాఠశాలను అడిషనల్ కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని టీఎస్ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించాక విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న తాగునీటికి పరీక్షలు జరపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో నాగనాథ్, డీటీ రంజిత్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఘన, వ్యర్థ పదార్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 14వ, 35వ వార్డులో ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన మున్సిపల్ అధికారులు కల్పించారు. వార్డులలో మురికికాలువలో పేరుకు పోయిన పూడికతో పాటు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. ఇంటి చుట్టూ నీరు నిలువ లేకుండా చూడాలని అధికారులు సూచించారు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఇన్‌చార్జి శానిటరి ఎస్సై సురేష్, వార్డు అధికారులు, జవాన్లు, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల అందజేత



మాక్లూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు బుధవారం ఏకరూప దుస్తులను అందజేశారు. మండల విద్యాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో బ్రహ్మానందం, ప్రిన్సిపల్ స్రవంతి, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899